# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 142 పేజీలు : 8 వెల : రూ.2/- గురువారం 18 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

**భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం**

హర్మూజ్‌పై ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం

ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ

మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్య




**ప్యారిస్,మన జనప్రగతి జూన్ 17:**హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, మిగతా2లో...

## యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి

● 21 యోగా దినోత్సవానికి పటిష్టంగా ఏర్పాట్లు చేయాలి

● అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు సూచన



**అమరావతి,మన జనప్రగతి జూన్ 17:** అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 'యోగాంధ్ర-2026' ఏర్పాట్లపై బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు. శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని మిగతా2లో...



## సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

ప్రజలను మోసగించే వారు సమాజానికి చేటు

అలాంటివారు జైల్లో ఉండడమే కరెక్ట్

సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 17:** సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం.

మిగతా2లో...

## ఎపిలో విస్తరించిన ద్రోణి

- ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి



**అమరావతి,మన జనప్రగతి జూన్ 17:** తూర్పు విదర్భ - తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది. ఈ ద్రోణి ప్రభావంతో గురువారం రాష్ట్రంలో

మిగతా2లో...

## వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

● అభిమాని చిన్నారి నిరంజన్‌కు పరామర్శ ● వైద్యం కోసం లక్ష రూపాయాల ఆర్థికసాయం ● భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



**వరంగల్,మన జనప్రగతి జూన్ 17:**ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో

మిగతా2లో...

## నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

● పెమ్మసానితో కలసి పూజ చేసిన లోకేశ్

● రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీ నిర్మాణం



**గుంటూరు,మన జనప్రగతి జూన్ 17:**నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. నంబూరు-మంగళగిరి సెక్షన్ మార్గంలో మంగళగిరి-నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులకు ఈ ఉదయం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మంగళగిరి-నిడమర్రు రోడ్డు వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ లకు పార్టీ నాయకులు, మిగతా2లో...



## టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

**కేంద్రం తీరుపై మండిపడ్డ రాహుల్, కేజ్రీవాల్**

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 17:**నీట్-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా నిషేధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వివాదాన్ని రేకెత్తించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నాయకులు ఈ చర్యను తీవ్రంగా విమర్శించారు. 'ఈ చర్య నిజంగా పేపర్ లీక్‌లను నిరోధిస్తుందా' అని వారు సందేహాలు వ్యక్తం చేశారు.

మిగతా2లో...

## టూరిజం ప్రమోషన్ కోసమే బీచ్ సాక్స్ పాలసీ

ఒక్క ఎపిలోనే ఇది ప్రారంభించడం లేదు

ప్రజలకు ఇబ్బంది లేకుండా దీనిని అమలు చేస్తాం

వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు

ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**విశాఖపట్నం,మన జనప్రగతి జూన్ 17:** బీచ్ సాక్స్ పాలసీ ఒక్క మన రాష్ట్రంలోనే లేదని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా దీనిని తీసుకొస్తున్నామని వివరించారు. దీనిని విశాఖపట్నం, బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌లలో పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొస్తున్నామన్నారు. ఆల్కహాల్ మిగతా2లో...




## యోగాంధ్రలో హోంమంత్రి ఆసనాలు

## మహిళల పట్ల వైసిపికి గౌరవం లేదు

అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననం

జగన్, వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి గొట్టిపాటి



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
18 - 06 - 2026

# హర్మ్యూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

(మొదటి పేజీ తరువాయి)

వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మ్యూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోదీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హోర్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోదీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోదీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)



పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు. దశాబ్దాలుగా ఈ మార్గంలో రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మంత్రి లోకేష్ చొరవ తీసుకుని రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి మంజూరు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరుకు కృషిచేశారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిడమర్రు, మంగళగిరి, తాడికొండ, అమరావతి ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రజా రాజధాని అమరావతికి సులభమైన, నిరంతరాయ రవాణ అనుసంధానాన్ని కల్పిస్తుంది. మంగళగిరి, అమరావతి మధ్య ప్రయాణ దూరం తగ్గుతుంది. మంగళగిరి పట్టణం నుంచి మంగళగిరి నియోజకవర్గంలోని బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల ప్రజలకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. భవిష్యత్ లో ఈ ప్రాంతంలో పట్టణీకరణ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. రైల్వే క్రాసింగ్ గేటు ద్వారా రోజుకు సుమారు 60 రైళ్లు ప్రయాణిస్తాయి. రోజుకు రహదారి రాకపోకల కోసం గేటు మూసివేసే సగటు వ్యవధి 8 నుంచి 10 గంటలుగా ఉంది. లెవల్ క్రాసింగ్ గేటు మూసివేసిన సమయంలో ప్రయాణీకులు దాటేందుకు 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టేది. ఆర్వోబీ నిర్మాణంతో సుమారు నిమిషంలోనే దాటే అవకాశం ఉంది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్వోబీ రైల్వే లైన్ పై 10 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. దీని పొడవు 767.50 మీటర్లు. ఇందులో రైల్వే లైన్ నుంచి అమరావతి వైపు 362 మీటర్లు, మంగళగిరి వైపు 405.50 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. వంతెనపై నాలుగు లైన్లు రహదారి ఏర్పాటుచేయనున్నారు. ప్రతి లైను 3.75 మీటర్లు కాగా మొత్తం క్యారేజ్ వే వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. అదనంగా 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాష్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్లు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు 5.5 మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. సర్వీస్ రోడ్లతో సహా ఆర్వోబీ మొత్తం వెడల్పు 28 మీటర్లు ఉండనుంది. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు సత్యనారాయణ, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళల పట్ల వైసిపికి గౌరవం లేదు

**అమరావతి,మన జనప్రగతి జూన్ 17:** మహిళల పట్ల జగన్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేకే వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీపై గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ నేతల బూతులు ప్రజలు వినలేకపోయారని అన్నారు. గత రెండేళ్ల నుంచి రాష్ట్రంలో బూతుల గోల లేదని, ప్రజలు ప్రశాంతంగా ఉంటే ఉనికి చాటుకునేందుకు గొడ్డలి పార్టీ నేతలు యత్నిస్తున్నారని మండిపడ్డారు. మహిళల్ని కించపరిచేలా ఎవరు మాట్లాడినా ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మారడం లేదని, ఇంగితం లేకుండా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. మహిళలపై ద్వేషంతోనే వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మహిళల పట్ల చులకనగా మాట్లాడే నేతలకు ఈ సమాజంలో స్థానం లేదని గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ డీఎన్ఏ అని రాజ్యసభ సభ్యులు సానా సతీశ్ వ్యాఖ్యానించారు. తన రాజకీయ పబ్బం కోసం జగన్ కాపులను బలిపశువుల్ని చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. అన్నివర్గాల ప్రజలు.. జగన్ కుట్రలను తిరస్కరించి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసినా మళ్లీ కులాల మధ్య చిచ్చుకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. జగన్ కుల చిచ్చులో భాగంగానే గుడివాడ అమర్‌నాథ్ దిగజారేలా హోం మంత్రి అనితపై విమర్శలు చేశారన్నారు. మహిళలంటే జగన్‌కు మొదటి నుంచీ ద్వేషమని.. కన్న తల్లి, సొంత చెల్లిని గెంటేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. గుడివాడ అమర్‌నాథ్ బేషరతుగా హోంమంత్రి అనితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల వైసీపీ నేతల చిన్నచూపుకు ఇది నిదర్శనమమని సతీశ్ అన్నారు. అహంకారంతో మహిళలను అవమానిస్తే సహించబోమన్నారు. మహిళల పట్ల గొడ్డలి పార్టీ వైఖరి ఇలాగే ఉంటే 2029లో ఆ 11 సీట్లు కూడా రావన్నారు. కష్టపడి స్వశక్తితో ఉన్నత స్థానానికి చేరుకున్న అనిత పట్ల ఇటువంటి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు.

## యోగాంధ్రలో హోంమంత్రి ఆసనాలు



**అనకాపల్లి,మన జనప్రగతి జూన్ 17:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోం మంత్రి, ఎంపీ, అధికారులు యోగాసనాలను వేశారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో అవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి ప్రధాన ఈవెంట్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. అలాగే యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం పేర్కొన్నారు. ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయుష్ శాఖ అధికారులు, అలాగే ప్రకృతి వైద్యం, యోగా సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. వారు యోగా కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం పెంపుపై ఈ సమావేశంలో చర్చించారు.

# సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశం లో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఔఅఖీః) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# ఎపిలో విస్తరించిన ద్రోణి

(మొదటి పేజీ తరువాయి)

ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. కోస్తాంధ్ర జిల్లాలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుందని సూచించింది. బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందని వివరించింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేసింది. ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని రైతులు, కూలీలు, పశువుల కాపరులకు విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోద య్యాయని వివరించింది. విజయనగరం జిల్లా వేపాడలో అత్యధికంగా 96.7 మిల్లీమీటర్లు, అనకా పల్లి జిల్లా దేవరాపల్లిలో 72 మి.మీ, శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నంలో 69.01 మి.మీ, నర్సీపట్నంలో 66.5 మి.మీ., వజ్రపు కొత్తూరులో 65.8 మి.మీ., నంద్యాల జిల్లా టంగుటూరులో 64.4 మి.మీ., అనకాపల్లి జిల్లా బలిఘట్టం, రావికమతంలో 57.7 మి.మీ., శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో 45.2 మి.మీ. వర్షపాతం నమోదైందని వివరించింది. వాతావరణ హెచ్చరికలను గమనించి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. వర్షాలు, పిడుగుల నేపథ్యంలో అవసరమైతే మాత్రమే బయటకు రావాలని ప్రజలకు ఆ సంస్థ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షా పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు 'పేపర్ లీక్ మాఫియాపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, టెలిగ్రామ్‌ను నిషేధించారు. ఇది సమస్యకు పరిష్కారం కాదు. దొంగలను పట్టుకోలేక, బాధితుల తలుపులకు తాళం వేస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లుగా టెలిగ్రామ్‌ను ఉపయోగిం చుకుని నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, డిస్కషన్‌లతో చదువుకుంటున్నారు. ఆ సౌకర్యాన్ని లాక్కోవడం పేపర్ లీక్‌లకు పరిష్కారం ఎలా అవుతుంది' అని సోషల్ మీడియా ద్వారా రాహుల్ విమర్శించారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ అంశంపై స్పందించారు. 'ఈ రోజు టెలిగ్రామ్‌ను నిషేధించారు. రేపు వాట్సాప్‌ను కూడా నిషేధిస్తారా?' అంటూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ నిషేధాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్, ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ కూడా ఈ చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది 15 కోట్లకు పైగా భారతీయ వినియోగదారులను శిక్షించడమే. ఈ చర్య అసలు లీక్‌లను ఆపదు' అని వ్యాఖ్యానించారు.

# టూరిజం ప్రమోషన్ కోసమే బీచ్ సాక్స్ పాలసీ

(మొదటి పేజీ తరువాయి)

మోతాదు తక్కువ ఉండే మద్యం ఇక్కడ ఉంటుందని వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖలతో చర్చించి.. వీటిని ఏర్పాటు చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఇకపోతే వైసీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం విశాఖపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మచిలీపట్నంలో బియ్యం దొంగ పేర్ని నానికి వయస్సు పెరిగింది కానీ జ్ఞానం పెరగలేదన్నారు. తమ నాయకుడు, మంత్రి లోకేశ్ వ్యాఖ్యలను పేర్ని నాని వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఫ్యామిలీని విమర్శించినట్లు దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గతంలో ఎన్టీఆర్ కుమార్తె భువనమ్మ, టీడీపీ అధినేత చంద్రబాబు మీద వైసీపీ నాయకులు వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళల రక్షణ, శాంతి భద్రతల కోసం కష్టపడుతున్న హోం మంత్రి వంగల పూడి అనితపై వైసీపీ నేత వ్యాఖ్యలు చేయడం దారుణమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గౌతు లచ్చన్న మనవరాలు ఎమ్మెల్యే గౌతు శిరీషపై చేసిన వ్యాఖ్యలు మరచి పోతామా? అన్నారు. రాజధాని అమరావతి కోసం పోరాటం చేసిన మహిళలను ఎంతో కించపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ తన సొంత తోబుట్టువుపై నీచంగా మాట్లాడారని గుర్తు చేశారు. సొంత బాబాయినీ గొడ్డలి పోటు వేసి.. ఆయన కుమార్తె వైఎస్ సునీతపై నీచంగా మాట్లాడారని తెలిపారు. ఇదేనా మహిళలపై మీకున్న గౌరవం అని వైసీపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. వీటిని రాష్ట్ర ప్రజలు మర్చిపోరన్నారు. వైసీపీ నేతల మాటలే వారికి సమాధి రాళ్లు అని అభివర్ణించారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్‌కు సీపీఐ వినతి



**దేవనకొండ మన జనప్రగతి జూన్ 17:-** దేవనకొండ మండలంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ మండల ప్రతినిధి బృందం బుధవారం జిల్లా కలెక్టర్ డా. సిరికి వినతిపత్రం అందజేసింది.మండలానికి వచ్చిన కలెక్టర్‌ను కలిసిన సీపీఐ మండల కార్యదర్శి ఎం. నరసారావు నేతృత్వంలోని నాయకులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా దేవనకొండలో డీఎన్‌టీఎ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని, మండలంలో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి సీసీ రహదారి నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.హంద్రీ-నీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ సమీపంలో సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, చెల్లెల చెలిమల, పి.కోటకొండ మీదుగా మాచాపురం చెరువుకు నీరు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారంతో మండల ప్రజలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సీపీఐ నాయకులు తెలిపారు.జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఖండప్ప, సీపీఐ మండల నాయకులు రవి, భాస్కర్, నరేష్, మద్దిలేటి, రాజశేఖర్, హరి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి

● ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిది ● మండల టిడిపి కన్వీనర్ రామమునిరెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 17:-**ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని, ఓటు అనేది ఒక వజ్రాయుధం లాంటిదని మండల తెదేపా కన్వీనర్ సింగా రెడ్డి రామముని రెడ్డి అన్నారు. అంత విలువైన ఓటు హక్కును పరిరక్షించు కోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వేంపల్లిలో బుధవారం ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పక్రియ కార్యక్రమంలో భాగంగా స్థానిక పాతపేట లో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి బిఎల్ఓ తమ పరిధి లోని ప్రతి ఓటరు పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అక్రమంగా ఓటర్లను చేర్చే ప్రయత్నాలు జరిగితే వెంటనే గుర్తించి అభ్యంతరాలు నమోదు చేయాలన్నారు. ఎస్ఐఆర్ పక్రియ పూర్తి అయ్యే వరకు బూత్ కమిటీ సభ్యులు ఓటర్లకు అందుబాటులో ఉండాలని సూచనలు చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సమస్యలు ఉంటే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్హత కలిగిన ఉన్న ఓటర్ల పేర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బిఎల్ఓ లు రెడ్డిరాణి, గంగిరెడ్డి, బూత్ కమిటీ సభ్యులు, వేంపల్లి పట్టణ తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్, టీడీపీ యూనిట్ సభ్యుడు జబిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను అభినందించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 17:-**యోగాంధ్ర 2026 లో భాగంగా జిల్లా స్థాయి లో గెలుపొందిన క్రీడాకారులను జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ బుధవారం అభినందించారు.కర్నూలు జిల్లా నుండి 23 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు.ఈ సందర్భంగా జేసీ వారిని అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో గెలుపొంది కర్నూలు జిల్లా పేరును నిలబెట్టాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమం లో సీఈఓ సెట్కూరు డాక్టర్ వేణుగోపాల్, యోగాంధ్ర ఆయుష్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అమర్నాథ్, యోగ అసోసియేషన్ అధ్యక్షులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

● ఇద్దరు నిందితులు అదుపులోకి..11 తులాల బంగారం,కేటీఎం బైక్ స్వాధీనం



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 17:-**అంతరాష్ట్ర స్థాయిలో చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 11 తులాల బంగారం, కేటీఎం ద్విచక్ర వాహనం, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ రామనాథ్ హెగ్డే తెలిపారు. బుధవారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. భాకరాపేట వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అడ్డుకోవడంతో వారు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఎస్సై హారిక, హెడ్ కానిస్టేబుల్ అంజీనాయక్, హోంగార్డు ప్రదీప్ కుమార్ వెంటాడి వారిని పట్టుకోగా, ఈ క్రమంలో ఇద్దరు పోలీసు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. విచారణలో నిందితులు సిద్ధవటం, ఒంటిమిట్ట, భాకరాపేట, బంగారుపాలెం ప్రాంతాలతో పాటు తమిళనాడులో నమోదైన పలు చైన్ స్నాచింగ్, దొంగతనాల కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు అంగీకరించినట్లు ఏఎస్పీ తెలిపారు. వృద్ధ మహిళలు, ఒంటరిగా ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేష్ బాలమురుగన్, ముత్తుపాండి ముత్తురామలింగంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు వెంకటేశ్వర్లు, హాజీ వలి, ఎస్సైలు హారిక, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలి

**దూదేకొండలో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 17:** టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి రెండు నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అన్నారు.బుధవారం పత్తికొండ మండలం దూదేకొండ గ్రామ సమీపంలోని కనకతిన్న ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యూనిట్‌లో కొనసాగుతున్న సివిల్ పనులు, యంత్రాల ఏర్పాట్లు, మౌలిక వసతుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పంటలకు విలువ ఆధారిత ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో గత ఏడాది ఈ టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. యూనిట్‌కు సంబంధించిన ప్రాథమిక, ద్వితీయ ప్రాసెసింగ్ విభాగాల సివిల్ పనులు పూర్తయ్యాయని, యంత్రాల కొనుగోలు కోసం ఇప్పటికే వర్క్ ఆర్డర్లు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో రెండు నెలల్లో యంత్రాల ఏర్పాటు పూర్తయ్యి ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్‌లో ప్రధానంగా టమోటా కెచప్, టమోటా పల్ప్, టమోటా సాస్ తయారీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. టమోటా సీజన్ ముగిసిన అనంతరం మామిడి, అరటి, జామ వంటి పండ్ల ప్రాసెసింగ్‌కు అనుగుణంగా యూనిట్‌ను పని చేస్తుందని తెలిపారు. టమోటా ధరలు పడిపోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితులు తరచూ ఎదురవుతున్నాయని, అలాంటి సందర్భాల్లో రైతుల నుంచి టమోటాలను కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేయడం ద్వారా వారికి గిట్టుబాటు ధర లభించేలా ఈ యూనిట్ కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాసెసింగ్ అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంత రైతులు ఆయా రకాల సాగుపై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. యూనిట్‌లో గంటకు 6 టన్నుల టమోటా పల్ప్ ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, రోజుకు సుమారు 3 మెట్రిక్ టన్నుల కెచప్ తయారు చేయగల సామర్థ్యం ఉంటుందని వివరించారు. నెలకు సుమారు 1,200 మెట్రిక్ టన్నుల టమోటాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రం పనిచేయనుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా టమోటా రైతులకు మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు విలువ ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసి యూనిట్‌ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, తహసీల్దార్ రామేశ్వర రెడ్డి, ఏపీఎంఐపీడీ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

# జిల్లా జైలులో న్యాయ అవగాహన సదస్సు





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 17:-** జిల్లా ప్రధాన న్యాయ మూర్తి / జిల్లా న్యాయ సేవాది కార సంస్థ అధ్యక్షులు జి. కబర్ధి మరియు జిల్లా న్యాయ సేవాది కార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి జిల్లా కారాగారము లో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జైలులో ఏర్పాటు చేసిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను, మరియు ములాఖత్ హెల్ప్ డెస్క్ ను తనిఖీ చేశారు. "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ మరియు ములాఖత్ హెల్ప్ డెస్క్ " గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు వారి కున్న హక్కుల ను తెలుసు కోవాలని తెలిపారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు శివరాం మరియు సులోచన, హెల్ప్ డెస్క్ న్యాయ వాది ప్రవీణ్ కుమార్, ప్యారా లీగల్ వాలెంటీర్స్ హేమంత్, ఓం ప్రకాష్, శివాని,ఖైదీలు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాలి

**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి**

**దళిత క్రైస్తవుల హక్కులపై సమగ్ర నిర్ణయం అవసరం**

**రాష్ట్రపతికి పోస్ట్‌కార్డుల ద్వారా ప్రజాభిప్రాయం తెలియజేస్తాం**



**కడప మన జనప్రగతి జూన్ 17:-**దళితులు చర్చికి వెళ్తే షెడ్యూల్డ్ కులాల హక్కులు కోల్పోతారనే భావన సరైనది కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దేశంలో సిక్కులు, బౌద్ధులు, జైనులకు షెడ్యూల్డ్ కులాల హక్కులు కొనసాగుతుండగా, దళితులు క్రైస్తవ మతాన్ని అనుసరిస్తే మాత్రం హక్కులు కోల్పోతారనే పరిస్థితి వివక్షకు దారితీస్తోందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను కల్పించిందని, వ్యక్తులు తమ విశ్వాసాల ఆధారంగా మతాన్ని అనుసరిస్తారని, దీనిని హక్కుల కోణంలో చూడాలని అన్నారు.దళిత క్రైస్తవుల హక్కుల అంశంపై గతంలో కూడా పలు తీర్పులు వచ్చినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ అంశాన్ని పునఃపరిశీలించాలని కేంద్రాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం దళితులలో అభద్రతా భావం పెరుగుతోందని, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై ప్రజల అభిప్రాయాలను రాష్ట్రపతికి తెలియజేసేందుకు కడప నుంచే పోస్ట్‌కార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే రఘురాం రెడ్డి, మాజీ మేయర్ పాకా సురేష్, జైచంద్రారెడ్డి, వినోద్, కిషోర్, కంచుపాటి బాబు, వెంకటేశ్వర్లు, మైనారిటీ నాయకులు రాయల్ బాబు, పులి వెంకటసుబ్బమ్మ, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 17:-**మండల పరిధిలో ఉద్దేహాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొని ప్రజల నుంచి వినతులు,అర్జీలను స్వీకరించారు, మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత,సామాజిక,అభివృద్ధి సంబంధిత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు,ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు,ముఖ్యంగా తాగునీరు, రహదారులు,విద్యుత్,పింఛన్లు, గృహాలు,రెవెన్యూ మరియు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని సూచించారు,ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం లభిస్తోందని,అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు, ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు,ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ మునివేలు,డిప్యూటీ ఎంపీడీవో వెంకటరమణ,మండల సీనియర్ నాయకులు,కొత్తపల్లి మల్లికార్జున.ఎంపీపీ ముల్లంగి నాగమణి.నారాయణస్వామి. మండల కన్వీనర్ కే.మల్లన్న,మాజీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు కొత్తపల్లి మహేంద్ర, సంగప్ప,నవీన్,హనుమంత,మరియు వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## దర్గా హోన్నూరు రైతులకు వేరుశెనగ కాయల పంపిణీ



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 17:**-మండల పరిధిలో దర్గా హోన్నూరు గ్రామ రైతు సేవా కేంద్రంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు గ్రామ మాజీ సర్పంచ్ కేశప్ప,మాజీ ఎంపీటీసీ ఆనంద్ ఆధ్వర్యంలో వారి చేతులమీదుగా రైతులకు వేరుశెనగ కాయల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన వేరుశెనగ విత్తన కాయలను అందజేసి, సకాలంలో విత్తనాలు వేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు,వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు,రైతు సేవా కేంద్రాల ద్వారా అందుబాటులో ఉన్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు,ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ఆశా,టీడీపీ నాయకులు కుమ్మరి వన్నూరప్ప, వి.ఎల్.రామాంజినేయులు,నాగరాజు,మహమ్మద్ రఫీ,వన్నూరు స్వామి,సంతోష్,గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీ..

**- నిబంధనలు పాటించాలని ఏపీవో సూచన**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 17:**- మండలంలోని ఖాజీపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఏపీవో నరసింహులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, కూలీల హాజరు వివరాలను పరిశీలించి మస్టర్‌ను తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనులకు జాబ్ కార్డు కలిగిన కూలీలు మాత్రమే హాజరుకావాలని, ఫీల్డ్ అసిస్టెంట్ సూచించిన ప్రదేశాల్లో నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే కూలి నగదు వారి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఖాజీపల్లెలో నిర్వహిస్తున్న కొండ కందకాల పనులకు 246 మంది కూలీలు హాజరైనట్లు వెల్లడించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## రెండు నెలలుగా తాగునీటి సమస్య..

**- మోటార్ మరమ్మతులు పూర్తి చేయాలని వెంకటేశ్వరాపురం గ్రామస్తుల విజ్ఞప్తి**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 17:**-మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరాపురం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం నీటి సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో భద్రావతి భావనారాయణ స్వామి ఆలయం సమీపంలోని నీటి సరఫరా మోటార్, పైపులను మరమ్మతుల కోసం తొలగించినప్పటికీ ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదని ఆరోపించారు. తీవ్ర ఎండల నేపథ్యంలో గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు నిత్యావసర పనులకు నీటి కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే మరమ్మతుల కోసం తొలగించిన పైపులు రెండు నెలలుగా ఆరుబయటే ఉండటంతో అవి చోరీకి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి మోటార్ మరమ్మతులు పూర్తి చేసి గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు.

## శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి వెండి వేలాయుధాన్ని బహుకరించిన మాజీ సర్పంచ్



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 17:** వేంపల్లె లోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి రూ. 65,000/- లు విలువ చేసే వెండి వేలాయుధాన్ని బహుకరించారు.వేంపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ రాయవరం రామలింగయ్య కుటుంబ సభ్యులు సతీమణి నాగలక్ష్మి,కుమారుడు శరత్ బాబు,కోడలు లక్ష్మీ, కుమార్తెలు రేష్మా,సుష్మా, మనవళ్లు సాయి గణేష్,గంగాధర్,కుంధన్, కలిసి ఆలయ అర్చకులు శేషగిరిరావుకు అందజేసి భక్తిని చాటుకున్నారు. ముందుగా శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పంచామృతాభిషేకం, మంత్రపుష్పం,మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దాతలను దుశ్శాలువతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల సహకారాం మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి సాంబశివుడు,బీజేపీ నేత గాలి హరిప్రసాద్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు మురికి రాజేష్,కామిశెట్టి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాకినాడ జిల్లా టెంట్ హౌస్ యాజమాన్య సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం



**కాకినాడ మన జనప్రగతి జూన్ 17:**-కాకినాడ జిల్లా టెంట్ హౌస్,ఫంక్షన్ మెటీరియల్, లైటింగ్ మరియు సౌండ్ సిస్టమ్ యాజమాన్య సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కాకినాడలోని పద్మనాభ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘ సభ్యులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ టెంట్ హౌస్, లైటింగ్, సౌండ్ సిస్టమ్ రంగాల్లో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, సభ్యుల మధ్య తలెత్తే సమస్యలను పరస్పర అవగాహనతో శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సంఘం అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా యక్కల ప్రసాదరావు, అధ్యక్షుడిగా నారాయణదాసు బూబ్, ఉపాధ్యక్షుడిగా నడికట్ల లోవరాజు, కార్యదర్శిగా కొప్పిశెట్టి నాగబాబు, కోశాధికారిగా పేరి పవన్ కుమార్, సంయుక్త కోశాధికారిగా రెడ్డి సత్యనారాయణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, పెంకే శ్రీనివాస బాబా, గీసాల శ్రీను తదితర ప్రముఖులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన సభ్యులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

## ఉరవకొండ ఎంఈఓ కార్యాలయంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

**వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన నాయకులకు అందుబాటులో లేని ఎంఈఓ**

**సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిక**




**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 17:**- ఉరవకొండ మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ అందుబాటులో లేకపోవడంపై విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధూ, జిల్లా అధ్యక్షుడు నందు ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించగా, సంబంధిత అధికారి కార్యాలయంలో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు, తల్లిదండ్రులు వివిధ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, పుస్తకాల విక్రయాలు, విద్యా సంబంధిత అంశాలపై పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేయడానికి వచ్చిన తమకు అధికారి లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు. కార్యాలయంలో సరైన సమాచారం అందకపోవడంపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయ పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు జవాబుదారీతనంతో సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

## పులివెందుల శిల్పారామం ఏ.ఓగా బి.సుధాకర్ బాధ్యతల స్వీకరణ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 17:**-పులివెందుల శిల్పారామం నూతన పరిపాలనాధికారి (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ )గా బి.సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నుండి బదిలీపై వచ్చిన ఆయన ఈ రోజు శిల్పారామంలో ఏవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గతంలో తాను పులివెందులలో పరిపాలనాధికారిగా పనిచేసిన సమయంలో స్థానిక ప్రజలు, సిబ్బంది అందించిన సహకారం,ప్రోత్సాహం మరియు మద్దతు ఎంతో అభినందనీయమన్నారు. ఆ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా భవిష్యత్తులో కూడా శిల్పారామం అభివృద్ధికి,నిర్వహణకు అందరూ తమ విలువైన సహకారం,సూచనలు మరియు మద్దతును ఇలాగే అందించాలని ఆయన కోరారు.

## పులివెందులలో ఘనంగా ఖేత్ బచావో అభియాన్ అవగాహన ర్యాలీ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 17:** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పులివెందుల ఆహార సాంకేతిక కళాశాల మరియు వ్యవసాయ కళాశాల సంయుక్తాధ్వర్యంలో బుధవారం పులివెందుల టౌన్‌లో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం క్రింద భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆహార సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ,వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.రామారావు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పులివెందుల పాత బస్టాండ్ నుండి పూలంగళ్లు సర్కిల్ వరకు సాగిన ఈ ర్యాలీలో రెండు కళాశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు,20 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. భూసార రక్షణ,పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆహార సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయంలో అధిక రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకం వల్ల నేల సారం దారుణంగా తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములను,మట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, భవిష్యత్ తరాలకు నమ్మకమైన ఆహార భద్రత కల్పించడమే ఈ ఖేత్ బచావో అభియాన్ ముఖ్య లక్ష్యం అని తెలిపారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.రామారావు మాట్లాడుతూ రైతులు ఇకనైనా రసాయన పద్ధతులను వీడి సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అలాగే సాగులో నీటి వనరులను పొదుపుగా వాడుకుంటూ, వాటిని సంరక్షించడంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అవగాహన ర్యాలీలో రెండు కళాశాలల అసోసియేట్ డీన్లు డాక్టర్ ఎమ్.మాధవ డాక్టర్ జి.రామారావులతో పాటు నేషనల్ సర్వీస్ స్కీమ్ అధికారులు,అధ్యాపక బృందం,ఫిజికల్ డైరెక్టర్లు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## పాల్తూరు-6 అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా అక్షరాభ్యాసం,గ్రాడ్యుయేషన్ వేడుకలు




**విడపనకల్లు మన జనప్రగతి జూన్ 17:**-విడపనకల్లు మండలంలోని పాల్తూరు-6 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల విద్యా ప్రస్థానానికి నాంది పలికే అక్షరాభ్యాసం మరియు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళి నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మూడేళ్లు పైబడిన చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించగా, ఐదేళు పూర్తిచేసుకుని ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించి అభినందించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, చిన్నారుల విద్యా ప్రస్థానంలో అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ వంటి కార్యక్రమాలు కీలక మైలురాళ్లని పేర్కొన్నారు. ఇటువంటి వేడుకలు పిల్లల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్. లక్ష్మీదేవి, ఈ. మల్లేశ్వరి, పి. నాగవేణి, చిన్నారుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ విద్యా ప్రస్థానంలో తొలి అడుగులు వేయడం వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## తెలుగు భాషకు వెలుగుదివ్వె 'తిరుమల రామచంద్ర': డా.చింతకుంట శివారెడ్డి




**కడప మన జనప్రగతి జూన్ 17:**-యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ప్రముఖ భాషావేత్త, రచయిత, పాత్రికేయుడు తిరుమల రామచంద్ర 114వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పరిశోధకులు, సాహితీ ప్రేమికులు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ తిరుమల రామచంద్ర పాత్రికేయుడు, సంపాదకుడు, కవి, నాటకకర్త, విమర్శకుడు, భాషావేత్త, అనువాదకుడిగా అనేక రంగాల్లో విశిష్ట కృషి చేసినప్పటికీ తనను తాను "భాషా సేవకుడను" అని వినయంగా చెప్పుకునేవారని పేర్కొన్నారు. తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృత, ప్రాకృత భాషలలో ప్రావీణ్యం సాధించిన బహుభాషా కోవిదుడని తెలిపారు. విద్యార్థి దశలో మహాత్మా గాంధీ ప్రభావంతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారని, దేశ విదేశాల్లో పర్యటించి విభిన్న సంస్కృతులపై లోతైన అవగాహన పెంపొందించుకున్నారని చెప్పారు. ఆయన రచించిన 'హంపీ నుంచి హరప్పా దాకా' ఆత్మకథ విశిష్టమైన గ్రంథమని, దీనికి మరణానంతరం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందని తెలిపారు. గ్రంథాలయ సహాయకులు ఎన్. రమేశ్‌రావు మాట్లాడుతూ తిరుమల రామచంద్ర గొప్ప దేశభక్తుడని, విద్యార్థి దశలోనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జాతీయ జెండా ఎగురవేశారని పేర్కొన్నారు. భగత్‌సింగ్ ఉరి నేపథ్యంలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొనడంతో ఆయనను కూడా అరెస్టు చేసి జైలులో ఉంచారని తెలిపారు. భాషాశాస్త్రానికి సంబంధించిన 'నుడినానుడి', 'మనలిపిపుట్టుపూర్వోత్తరాలు' వంటి గ్రంథాలు విలువైనవని అన్నారు. రచయిత కొత్తపల్లె రామాంజనేయులు మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సైన్యంలో పనిచేసిన తిరుమల రామచంద్ర, అనంతరం పత్రికా రంగం మరియు సాహిత్య రంగాల్లో విశేష సేవలందించారని చెప్పారు. సామాన్యుడిగా కనిపించినా అసామాన్య వ్యక్తిత్వం కలిగిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్. వెంకటరమణ, ఎం. మౌనిక, సిబ్బంది సుమతి, హరి, అరుణ, పాఠకులు నాగలక్ష్మి, సుదర్శన్, చంద్రయ్య, రవికుమార్, వెంకటరమణ, శ్రీహరి యాదవ్‌లు పాల్గొన్నారు.

# సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై సమీక్ష: జెడ్పీ డిప్యూటీ సీఈఓ రామచంద్ర




**గాలివీడు మన జనప్రగతి జూన్ 17:**-జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలకు సంబంధించిన జెడ్పీ డిప్యూటీ సీఈఓ రామచంద్ర, స్వచ్ఛ రథం, జలగారతి, యోగాంధ్ర తదితర పలు అంశాలపై సమీక్ష జరిపారు. బుధవారం గాలివీడు ఎంపిడిఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీలో భాగంగా సంక్షేమ కార్యక్రమాల సమీక్ష: మండలంలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛ రథం,జలహారతి మౌలిక వసతుల పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మండలాన్ని స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలలో అవగాహన కల్పించే కార్యక్రమాల్లో డిప్యూటీ సీఈఓ కీలక సూచనలు చేశారు. అనంతరంయోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత మరియు ఉల్లాసం పొందవచ్చని డిప్యూటీ సిఈఓ రామచంద్ర తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర క్యాంపెయిన్-2026' కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఎంపిడిఓ,పలు శాఖల అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దామోదర్ రెడ్డి,డిప్యూటీ ఎంపిడిఓ,ఈ.ఓ.పీ.ఆర్టి వెంకటేశ్వర్లు, జె.ఎస్.డబ్ల్యూ.ఎస్ డిప్యూటీ ఎంపిడిఓ గిరి ప్రసాద్ లు,కార్యాలయ ఏ ఓ జాబీర్ అహమ్మద్,ఏ.ఈ రాజశేఖర్ మరియు కార్యాలయ సిబ్బంది మరియు తదితురులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ విధానం రైతులకు లాభదాయకం



**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి 17:**-లక్కిరెడ్డిపల్లి మండలంలోని దండువారిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పీఎండీఎస్ విధానంలో సాగు చేస్తున్న రైతు పద్మావతి వేరుశనగ ఏ-గ్రేడ్ నమూనా క్షేత్రాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్, రీజియన్ కన్సల్టెంట్ చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎండీఎస్ విధానం ద్వారా ముందస్తు వర్షాలను సమర్థవంతంగా వినియోగించుకుని అధిక మొలక శాతం సాధించవచ్చని తెలిపారు. అలాగే నేలలో తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచడం ద్వారా పంట ఎదుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో ఈ విధానం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.అనంతరం రైతు మల్లేష్ తయారు చేసిన విత్తన గుళికలను పరిశీలించి, వాటి తయారీ విధానం, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన గుళికల వినియోగంతో విత్తనాల మొలక శాతం మెరుగుపడటంతో పాటు పంట ప్రారంభ దశలో ఆరోగ్యకరమైన ఎదుగుదల సాధ్యమవుతుందని వివరించారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులు తగ్గడంతో పాటు నేల సారవంతత పెరుగుతుందని, రసాయన రహిత ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందని, తద్వారా రైతుల ఆదాయం పెరిగే అవకాశాలు మెరుగుపడతాయని అధికారులు తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అవలంబించాలని పిలుపునిచ్చారు.ఈ క్షేత్ర సందర్శన కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ యశోద, దివ్యశ్రీ, ఎంటీ వెంకటరమణ, మోడల్ మేకర్ సరస్వతి, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లు గంగిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, లక్ష్మీదేవి, నాగమణి, ఐసీఆర్పీలు సంతోష్ కుమారి, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన సందోహంతో అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక వేడుకలు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 17:**-స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో జూన్ 15, 2026 సోమవారం ప్రారంభమైన శ్రీ రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వర స్వామి మరియు శ్రీ అభయ వరద సీతారామచంద్ర స్వామి వారి మహా కుంభాభిషేక మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి.మహోత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం ఉదయం గవ్యాంతర పూజలు, పంచవింశతి కలశ స్నపనాలు, శ్రీచక్రార్చన, గణపతి మూలమంత్ర జప తర్పణ హవనాలు, రుద్ర హోమం, నీరాజనం, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం యాగశాల ఆర్చనలు, మూలమంత్ర జప తర్పణ హవనాలు, నవగ్రహ హవనాలు, రుద్ర హోమం, మూలమంత్ర హోమాలు, నీరాజనం, ప్రసాద వితరణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ మహోత్సవాలలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి.రమణ, ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, వేద పండితులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన సానా సతీష్‌బాబుకు అభినందనలు



**కాకినాడ మన జనప్రగతి జూన్ 17:**-రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన సానా సతీష్‌బాబును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబు రాజు), రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సానా సతీష్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. రాజ్యసభలో రాష్ట్ర ప్రజల సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం సానా సతీష్‌బాబు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, రాష్ట్ర ప్రయోజనాల సాధనకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలను కించపరిచే ధోరణి మానుకోవాలి..!

- జనసేన నేత డాక్టర్ దాసరి రవిశంకర్
- అనితపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని జన సైనికుల డిమాండ్



**వేంపల్లి మన జనప్రగతి జూన్ 17:**-రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అవమానకర వ్యాఖ్యలను జనసేన సీనియర్ నాయకుడు డాక్టర్ దాసరి రవిశంకర్ తీవ్రంగా ఖండించారు. ఒక దళిత మహిళగా, ఉపాధ్యాయురాలిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి ప్రస్తుతం రాష్ట్ర హోంమంత్రిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనితపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం అమర్నాథ్ అహంకారానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది కేవలం హోంమంత్రి అనితను అవమానించడం మాత్రమే కాకుండా మహిళా సమాజం మొత్తాన్ని కించపరిచినట్లేనని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు హుందాగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని, వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని పేర్కొన్నారు. గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని హోంమంత్రి అనితకు, రాష్ట్ర మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మహిళల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చెన్నకృష్ణ రెడ్డి, నారాయణ, శ్రీను, కృష్ణ, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకిపురం వేదికగా జిల్లా జట్ల సమరం

- రెండో రౌండ్‌లో నాలుగు జిల్లాల జట్లు బరిలోకి
- ఉదయం 9 గంటలకు మ్యాచ్‌ల ప్రారంభం.



**వాల్మీకిపురం మన జనప్రగతి జూన్ 17:**-ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ అండర్-16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా రెండో రౌండ్ మ్యాచ్‌లు జూన్ 18 నుంచి వాల్మీకిపురంలోని సీడీసీఏజీవీఎస్ఎస్ క్రికెట్ మైదానాల్లో ప్రారంభం కానున్నాయి.ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ హెడ్ కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ..యువ క్రికెటర్లలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఈ టోర్నమెంట్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన అండర్-16 ఆటగాళ్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, మ్యాచ్‌లు అత్యంత పోటీతత్వ వాతావరణంలో జరగనున్నాయని తెలిపారు.గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లలో గ్రౌండ్-ఏలో నెల్లూరు జిల్లా జట్టు, కడప జిల్లా జట్టుతో తలపడనుండగా, గ్రౌండ్-బిలో చిత్తూరు జిల్లా జట్టు, కర్నూలు జిల్లా జట్టు మధ్య పోటీ జరగనుంది.ఈ టోర్నమెంట్ యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తుందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి జట్లకు ఎంపికయ్యే అవకాశాలను పెంపొందిస్తుందని సునీల్ కుమార్ పేర్కొన్నారు.యువ ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు క్రీడాభిమానులు, తల్లిదండ్రులు, స్థానిక క్రికెట్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరై మ్యాచ్‌లను వీక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజల సమస్యలపై అధికారులు చొరవ చూపాలి: ఎంపీపీ సుదర్శన్ రెడ్డి





**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 17:**-ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు.రెండేళ్లుగా మామిడి రైతులకు పంట బీమా నిధులు అందలేదని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని, కొత్త పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జూలై నుంచి ప్రతి జాబ్‌కార్డుకు 125 రోజుల ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఏపీవో తెలిపారు.ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో రైతులు వరి సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రాజకుమారి సూచించారు. రెండు రోజుల్లో 1,900 క్వింటాళ్ల నారాయణి వేరుశనగ విత్తనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, "తల్లికి వందనం" పథకంలో నగదు జమ కాని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సభ్యులు కోరారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ చక్రనాయక్ తెలిపారు.తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని, గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.**ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలపై ఆగ్రహం** నాలుగేళ్లుగా ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు అందకపోవడంపై ఎంపీపీ సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మండల తీర్మానం చేసి కమిషనర్‌కు పంపించాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఎంపీడీవో రెడ్డెయ్య, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు చిట్వేలిలో గ్రామ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ



**చిట్వేలి మన జనప్రగతి జూన్ 17:**-చిట్వేలి మండలంలోని గ్రామ కార్యదర్శులకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ క్యాలెండర్ పై ప్రత్యేక విశ్లేషణాత్మక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చిట్వేలి మండల అభివృద్ధి అధికారి కె. శ్రీనివాసులు తెలిపారు. చిట్వేలి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు మండల అభివృద్ధి అధికారి కార్యాలయం లోని సభా భవనంలో మండలంలోని గ్రామ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామ కార్యదర్శులకు సెలవులు రద్దు చేశామని తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. ప్రతి గ్రామ కార్యదర్శి సమావేశానికి హాజరయ్యే సమయంలో తమ గుర్తింపు కార్డుతో పాటు, ఆధార్ కార్డు తీసుకురావాలని ఆదేశించారు.

# డయేరియా,మలేరియాపై విద్యార్థులకు అవగాహన



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 17:**-మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో మలేరియా మాసోత్సవాల సందర్భంగా డయేరియా, మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్ల ప్రాముఖ్యతను వివరించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ దోమకాటు వల్ల తీవ్రమైన వ్యాధులు వస్తాయని, ప్రతి ఒక్కరూ రాత్రివేళ దోమతెరలు ఉపయోగించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ప్రతి శుక్రవారం 'డ్రై డే‌ఫ్రైడే' పాటించడం ద్వారా మలేరియాను నివారించవచ్చని తెలిపారు. అలాగే డయేరియా బారినపడిన చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలు జూన్ నెలాఖరు వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ కళావతి, సూపర్వైజర్ రమణయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డీఆర్‌సీ సమావేశంలో ప్రొద్దుటూరు

# సమస్యలపై ఎమ్మెల్యే గళం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 17:**-జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి సమావేశానికి హాజరైన ఆయన, ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న పనుల ఆలస్యం, పారిశుద్ధ్య కార్మికులకు జీతాల చెల్లింపు, రామేశ్వరంఆర్‌టీపీపీ బ్రిడ్జి నిర్మాణం, ఎన్‌హెచ్440 భూసేకరణ సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు.ముఖ్యంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కంటి విభాగంలో పనులు పూర్తికాకపోవడంతో శస్త్రచికిత్సలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అలాగే రామేశ్వరంఆర్‌టీపీపీ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.ముక్తియార్, కడప జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు డిప్యూటీ డీఎంహెచ్‌వోను సస్పెండ్ చేయాలి: డీవైఎఫ్ఐ డిమాండ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 17:**- ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో గీతారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..జిల్లాలోని ఆర్ఎంపీ క్లినిక్‌లపై వైద్య అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ, ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో మాత్రం అలాంటి చర్యలు కనిపించడం లేదని ఆరోపించారు. ఆర్ఎంపీ క్లినిక్‌లలో అర్హతలకు మించి వైద్య సేవలు అందిస్తున్నా, వాటిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న క్లినిక్‌లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఈ పరిస్థితులు అనేక అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు.ఆర్ఎంపీ క్లినిక్‌లకు డిప్యూటీ డీఎంహెచ్‌వో వత్తాసు పలుకుతున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఉందని శివకుమార్ అన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి గీతారెడ్డిని సస్పెండ్ చేయాలని,లేని పక్షంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

18 - 06 - 2026



# వెన్నుపోటుకు పేటెంట్ హక్కుదారుడు జగన్: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి మన జనప్రగతి, జూన్ 17:-** రాష్ట్ర రాజకీయాల్లో వెన్నుపోటు గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లిందని, అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆరోపించారు. 2014లో విభజన అనంతరం క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర పునర్నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేసిందని, అయితే 2019లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిందన్నారు. భారీ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. తల్లి, చెల్లిని రాజకీయంగా ఉపయోగించుకుని తర్వాత పక్కన పెట్టిన జగన్ వెన్నుపోటు గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. డీఎస్సీ, సీపీఎస్ రద్దు, సంపూర్ణ మద్యనిషేధం వంటి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి కల్పనపై దృష్టి సారించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలను ప్రజలు తిరస్కరిస్తారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# శ్రీ సాయి నగర్, మయూరి నగర్ అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి: బూరుగడ్డ పుష్పనగేష్



**పటాన్ చెరువు మన జనప్రగతి జూన్ 17:-** రామచంద్రపురం డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ డిమాండ్ చేశారు. నిన్న జోనల్ కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించిన నేపథ్యంలో, ఇంజనీరింగ్ విభాగ అధికారులను సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విభాగ ఎస్‌ఈ శంకర్ నాయక్, ఈఈ సురేష్, డీఈ వెంకటరమణ, ఏఈ శివకుమార్‌లతో కలిసి శ్రీ సాయి నగర్ కాలనీ, మయూరి నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయం లోపించడం వల్ల పనులు ఆలస్యమవుతున్నాయని పేర్కొంటూ, రానున్న వర్షాకాలానికి ముందే అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు, వర్షపు నీటి పారుదల సమస్యలను పరిశీలించిన అధికారులు, పెండింగ్ పనులపై త్వరలో కార్యాచరణ చేపడతామని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు వీర్‌శెట్టి, కార్యవర్గ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యుడు సానాకు అభినందనలు తెలిపిన భూపతి రాజు, గొల్లపల్లి



**కాకినాడ మన జనప్రగతి జూన్ 17:-** రెండవసారి రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన సానా సతీష్ బాబును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబు రాజు), రాజోలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గొల్లపల్లి అమూల్యతో కలిసి సానాకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే క్వాంటమ్ హైట్స్ లక్ష్యం: వైసీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి




**కడప మన జనప్రగతి జూన్ 17:-** విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే క్వాంటమ్ హైట్స్ విద్యా సంస్థ లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కడప నగర పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన క్వాంటమ్ హైట్స్ విద్యా సంస్థను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా రంగంలో విశేష అనుభవం కలిగిన వారు ఈ సంస్థను స్థాపించడం అభినందనీయమన్నారు. నేటి ఆధునిక యుగ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యలో మేళవిస్తూ, విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ విద్యా సంస్థ ముందుకు రావడం శుభపరిణామమని అన్నారు. తల్లిదండ్రుల ఆశయాలు, విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యను అందించేందుకు క్వాంటమ్ హైట్స్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ విద్యా సంస్థ తక్కువ కాలంలోనే మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి, తల్లిదండ్రుల విశ్వాసాన్ని పొందగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, కరస్పాండెంట్ నరేంద్రారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నారాయణమ్మ, డైరెక్టర్ కేజే కేశవరెడ్డి, జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, మాజీ మేయర్ పాకా సురేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు మరియు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన మొహరం ఉత్సవాలు

**- మండల వ్యాప్తంగా నెలకొన్న పండుగ వాతావరణం**



**వీరబల్లి మన జనప్రగతి జూన్ 17:-** వీరబల్లి మండలంలో మొహరం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముస్లింలతో పాటు హిందువులు కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాల్లో పాల్గొనడం ప్రత్యేకతగా నిలుస్తోంది. మండల కేంద్రానికి సమీపంలోని ఈడిగపల్లిలో వెలసిన పీర్ల ఉత్సవాలకు విశేష ప్రాధాన్యం ఉండటంతో మండలమంతా పండుగ వాతావరణం నెలకొంది. మొహర్రం ఇస్లామీయ క్యాలెండర్‌లో తొలి నెల. ఈ నెలలోని పదవ తేదీ అయిన యౌమీ ఆషూరా సందర్భంగా కర్బలా యుద్ధంలో అమరులైన ఇమామ్ హుసైన్ మరియు ఆయన అనుచరుల త్యాగాలను స్మరించుకుంటారు. ప్రజాస్వామ్య విలువలు, మానవ హక్కుల పరిరక్షణ కోసం జరిగిన చారిత్రక పోరాటానికి ప్రతీకగా మొహరాన్ని భావిస్తారు. కర్బలా యుద్ధంలో ఇమామ్ హుసైన్‌తో పాటు 72 మంది అమరులైన ఘటనను స్మరించుకుంటూ ఈ పది రోజులను విషాద దినాలుగా పాటిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా పీర్ల పండుగ పేరుతో మొహరం ఉత్సవాలు శతాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లిం ప్రజలు కలిసి ఈ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మొహరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండలంలో ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఏడవ రోజు చిన్న పీర్ల ఊరేగింపు, ఎనిమిదవ రోజు అగ్నిగుండ ప్రవేశం, తొమ్మిదవ రోజు వీరపల్లెలో అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం, పదవ రోజు పీర్ల నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొహరం ఉత్సవాల నేపథ్యంలో మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటుండటంతో వీరబల్లి ప్రాంతం ఆధ్యాత్మిక, భక్తి వాతావరణంతో కళకళలాడుతోంది.

# కోర్టు ప్రవేశ ద్వారం వద్ద న్యాయమూర్తి కారు పార్కింగ్..

**● కక్షిదారులు, దివ్యాంగులకు ఇబ్బందులు**




**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 17:-** ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద న్యాయమూర్తి వాహనం పార్క్ చేయడంపై కక్షిదారులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోర్టుకు విచారణల నిమిత్తం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుండగా, ప్రవేశ మార్గం వద్ద వాహనం నిలిపివేయడం వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు కోర్టు ఆవరణలోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. కోర్టు ప్రాంగణంలో వాహనాల పార్కింగ్‌కు తగినంత స్థలం ఉన్నప్పటికీ, ప్రధాన ద్వారం వద్దే వాహనం నిలిపివేయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్పందించేందుకు కక్షిదారులు, న్యాయవాదులు కూడా వెనుకంజ వేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. న్యాయస్థానానికి వచ్చే ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని, ప్రవేశ ద్వారం వద్ద ఉన్న వాహనాన్ని నిర్ణీత పార్కింగ్ స్థలానికి తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు సామాన్యుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని వ్యవహరించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కోర్టు ప్రవేశ మార్గం ఎలాంటి అవరోధాలు లేకుండా ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కక్షిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉద్దేహాల్ ప్రజలకు అతిసార నివారణపై అవగాహన ర్యాలీ




**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 17:-** మండల పరిధిలో ఉద్దేహాల్ ఆరోగ్య ఉపకేంద్రంలో అతిసార పక్షోత్సవాల సందర్భంగా జూన్ 16 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు వాంతులు, విరేచనాలు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా జింక్ మాత్రల వినియోగం, ఓఆర్ఎస్ (ఓఆర్ఎస్) ద్రావణం ప్రాముఖ్యత గురించి వివరించారు, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కలుషితమైన ఆహారం, నీటిని తీసుకోకుండా జాగ్రత్త పడాలని, వేడి వేడి ఆహారం తీసుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా అతిసార వ్యాధులను నివారించవచ్చని తెలిపారు, ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వాలని, చిన్నపిల్లలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్, శారద, ఆశా కార్యకర్తలు ఈరమ్మ, లక్ష్మి, హరిత, లక్ష్మి, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# ఒంటిమిట్టలో ఘోర రోడ్డు ప్రమాదం

**● ఆటోను ఢీ కొన్న లారీ...అక్కడికక్కడే ఆటో డ్రైవర్ మృతి**

**● మహిళకు తీవ్ర గాయాలు..రిమ్స్‌కు తరలింపు**



**ఒంటిమిట్ట మన జనప్రగతి జూన్ 17:-** కడపచెన్నై జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం మేరకు.. ఒంటిమిట్ట దిగువ వీధికి చెందిన మహమ్మద్ రఫీ (51) తన ఆటోలో మాధవరం గ్రామానికి చెందిన రేణుకను ఎక్కించుకుని ఒంటిమిట్ట నుంచి కడప వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సీతారాముల కళ్యాణ వేదిక సమీపానికి చేరుకోగానే కడప నుంచి చెన్నై వైపు అతివేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినగా, డ్రైవర్ మహమ్మద్ రఫీ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న రేణుకకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుడు మహమ్మద్ రఫీకి భార్య ఆశ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

# విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచిత విద్య అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితకు వినతిపత్రం అందజేసిన ఏఐఎస్యూబి రాష్ట్ర అధ్యక్షుడు జగన్ రాథోడ్**



**కడప మన జనప్రగతి జూన్ 17:-** జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం 25 శాతం ఉచిత సీట్లను కల్పించకుండా నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని, అలాంటి పాఠశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐఎస్యూబి రాష్ట్ర అధ్యక్షుడు జగన్ రాథోడ్ కోరారు. బుధవారం కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో విద్యా హక్కు చట్టం అమలులో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) షంసుద్దీన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చట్టం అమలుపై ఇప్పటివరకు ఏ ప్రైవేట్ లేదా కార్పొరేట్ పాఠశాలలోనూ తనిఖీలు నిర్వహించలేదని విమర్శించారు. అదేవిధంగా, ఈ విద్యా సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజులను విపరీతంగా పెంచాయని, కొంతమంది విద్యార్థుల నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. పాఠశాల ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం, రవాణా ఛార్జీల పేరుతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే డీఈఓ పనితీరుపై విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని మంత్రి సవితను కోరినట్లు జగన్ రాథోడ్ తెలిపారు.

# 12 లక్షల రూ" తాగునీటి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 17:-** మండలంలోని రంగాపురం క్యాంపులో 12 లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించిన తాగునీటి పైపులైన్ మోటార్‌ను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ.. ప్రతి గ్రామాల్లో తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా పైపులైన్‌లు, మోటార్లు మరియు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు, ఈ నూతన తాగునీటి పైపులైన్ మోటార్ ప్రారంభంతో రంగాపురం క్యాంపు ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని, నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో తహీశీల్దార్ మునివేలు, డిప్యూటీ ఎంపిడివో వెంకటరమణ, మండల సీనియర్ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, మండల కన్వీనర్ మల్లన్న, ఎంపీపీ ముల్లంగి నాగమణి, నారాయణస్వామి, మాజీ కన్వీనర్, బలరామి రెడ్డి, నాయకులు కొత్తపల్లి మహేంద్ర, కుమ్మరి మల్లికార్జున, తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కేశవ రెడ్డి, మరియు ప్రజలు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష అభ్యర్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం

**కాకినాడ మన జనప్రగతి జూన్ 17:-** ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్న "నీట్ పరీక్ష" కు హాజరయ్యే అభ్యర్థులందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంయువి మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా పరిధిలోని కాకినాడ, తుని డిపో బస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను చూపించి పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్ స్టేషన్లలో సహాయక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి కోరారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
18 - 06 - 2026

## రాచమల్లుపై జి.వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు: అభివృద్ధిపై బహిరంగ చర్చకు సవాల్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 17:-** ప్రొద్దుటూరులో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. టీడీపీ మాజీ ఇన్‌చార్జి జి.వి. ప్రవీణ్ కుమార్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాచమల్లు తెలిసి మాట్లాడుతున్నారో, తెలియక మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఐటీడీపీ అనేది కేవలం సోషల్ మీడియా విభాగమని, దానికి ఓట్లతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. తనపై అవినీతి ఆరోపణలు ఉంటే సీబీఐ విచారణకు సిద్ధమని రాచమల్లు చెబుతున్నారని, అయితే మహర్షి స్కూల్, డీఏడబ్ల్యూ కాలేజీ వ్యవహారాలపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యాపార కేంద్రంగా పేరొందిన ప్రొద్దుటూరును రాచమల్లు తన వైఫల్యాలతో వెనక్కి నెట్టారని, స్థానిక టౌన్ బ్యాంక్ దివాళా పరిస్థితికి చేరుకోవడానికి కూడా ఆయన విధానాలే కారణమని ఆరోపించారు. ప్రొద్దుటూరు రాజకీయాల్లో రాచమల్లు ఇప్పటికే ప్రజాదరణ కోల్పోయిన నాయకుడిగా మారిపోయారని వ్యాఖ్యానించారు. డీఏడబ్ల్యూ కాలేజీ వ్యవహారంలో అక్రమాలు జరిగాయా లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని, అందులో రాచమల్లు కుటుంబ సభ్యుల పాత్ర ఎంత ఉందో ప్రజలకు తెలియజేయాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వాల అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు రావాలని రాచమల్లుకు సవాల్ విసిరారు. డీఏడబ్ల్యూ కాలేజీ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారాయని, దీనిపై ప్రమాణం చేయడానికి కూడా తాను సిద్ధంగా ఉన్నానని ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అలాగే హౌసింగ్ శాఖలో జరిగిన కడ్డీల సరఫరా వ్యవహారంలో రాచమల్లు కుటుంబానికి 15 శాతం భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. వ్యక్తిగత విమర్శలు చేయడం తన ఉద్దేశం కాదని చెబుతూ, ప్రజలకు సంబంధించిన ప్రశ్నలకు రాచమల్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

## ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహణ

**- ఏర్పాట్లను ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు శాసనసభ్యులు తో కలసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**





**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 17:-** నేడు వై ఎస్ ఆర్ కడప జిల్లా కేంద్రం లో బిల్డప్ సర్కిల్ వద్ద గల పుత్తా ఎస్టేట్ నందు ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల పాలన పై జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్ల ను బుధవారం సాయంత్రం ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు శాసన సభ్యులు తో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారుకార్యక్రమ నిర్వహణలో భాగంగా ఎన్డీఏ రెండేళ్ల పాలన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు అధికారులనుఆదేశించారు.ప్రధాన వేదిక,సీటింగ్ అరేంజ్మెంట్,బ్యారీకేడింగ్, ఎల్ఈడి స్క్రీన్ నిర్వహణ సంబంధిత అంశాలన్నిటిని పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు...కార్యక్రమానికి వచ్చే లబ్ధిదారులకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, స్నాక్స్, భోజన ఏర్పాట్లు చేయాలన్నారు.ఏర్పాట్లు పరిశీలన కార్యక్రమంలో జేసీ డా.నిధి మీనా,కడప నగర కమిషనర్ భావన,కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, నాయకులు భూపేష్ రెడ్డి,సంబంధిత జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్లలో సంతృప్తికరంగా ఆహార పదార్థాలు అందించండి: కమిషనర్ (ఎఫ్.ఏ.సి)శారదా దేవి



**తిరుపతి మన జనప్రగతి జూన్ 17:-** నగరంలోని అన్నా క్యాంటీన్లలో ప్రజలకు సంతృప్తికరంగా ఆహార పదార్థాలు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని న్యూ బాలాజీ కాలనీ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం తింటున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నా కాంటీన్లకు వచ్చే ప్రజలకు సరిపడినంత ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. అన్నా కాంటీన్లలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పక్కనే ఉన్న చెత్త నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇంటింటి నుండి ఎంత చెత్త తీసుకువస్తున్నారు, తూకివాకం చెత్త నిర్వహణ కేంద్రానికి ఎంత తరలిస్తున్నారనేది పక్కగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ రమణ, ఏసిపి పార్వతిప్రియ, సర్వేయర్ గురువారెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

## రైతులకు ఎరువుల పంపిణీ మార్గదర్శకాల గోడ పత్రికల ఆవిష్కరణ



**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 17:-** జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన మార్గదర్శకాల గోడ పత్రికలను జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇంచార్జ్ మంత్రి సవితతో కలిసి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎరువుల పంపిణీ పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలపై రైతులు అవగాహన పెంపొందించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి , శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి , పుట్టా సుధాకర్ యాదవ్ , పుట్టా కృష్ణ చైతన్య రెడ్డి , జిల్లా కలెక్టర్ , వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం



**రైల్వేకోడూరు, మన జన ప్రగతి జూన్ 17:** మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, కుటుంబ సమస్యల పరిష్కారంపై అవగాహన కల్పించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైల్వేకోడూరు మండలంలోని అనంత రాజంపేట అరుంధతి వాడ గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు "మీ భద్రత మా బాధ్యత" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 150 మంది మహిళలు పాల్గొన్నారు. కోడూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది మండల అధికారులతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు సీఐ చంద్రశేఖర్ ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారులు, వెలుగు శాఖ ప్రతినిధులు పాల్గొని మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలు, చైన్ స్నాచింగ్, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే కుటుంబ వివాదాలు, దాంపత్య సమస్యల వల్ల కుటుంబ వ్యవస్థపై పడుతున్న ప్రభావం గురించి అవగాహన కల్పించారు. కుటుంబ విలువలను కాపాడుకోవడం, సమస్యలను పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవడం, పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు మంచి సంస్కారాలు అందించడం ద్వారా వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 లేదా 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని మహిళలకు సూచించారు. అలాగే మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగం, అందులో లభించే సేవల గురించి వివరించి, ప్రతి మహిళ తన మొబైల్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో భద్రత, చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత పెంచే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు.

## ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన






**రైల్వేకోడూరు మన జనప్రగతి జూన్ 17: -** తిరుపతి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రైల్వేకోడూరులో ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ శ్రీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో రైల్వేకోడూరు పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ చంద్రశేఖర్ మరియు పోలీసు సిబ్బంది మామిడికాయల మండి వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు వివరించారు. ట్రాక్టర్లలో అధిక లోడ్లు తీసుకెళ్లడం ప్రమాదాలకు దారితీస్తుందని, వాహనాలకు ప్రతిబింబించే రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో లైట్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు అధికమవుతుందని హెచ్చరించిన అధికారులు, అతివేగం కారణంగా అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు మరియు ఇతర అవసరాల కోసం ట్రాక్టర్లను వినియోగించే సమయంలో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రాణనష్టం, ఆస్తినష్టాన్ని నివారించవచ్చని వివరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న పోలీసులు, ట్రాక్టర్ డ్రైవర్లు మరింత అప్రమత్తంగా వ్యవహరించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా సీఐ చంద్రశేఖర్ మరియు పోలీసు సిబ్బంది ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లను అతికించి డ్రైవర్లకు భద్రతా సూచనలు అందించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ట్రాక్టర్ డ్రైవర్లు స్వాగతిస్తూ, రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తామని హామీ ఇచ్చారు.

## రౌడీలు ఎలాంటి నేరాలకు పాల్పడినా జిల్లా బహిష్కరణ వేటు వేస్తాం

**పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలి**

**శాంతిభద్రతల పరిరక్షణలో డ్రోన్ కెమెరాలను విస్తృతంగా వినియోగించాలి**

**పులివెందుల , మైదుకూరు సబ్ - డివిజన్ల నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్.పీ**






**కడప మన జనప్రగతి జూన్ 17:-** జిల్లాలో రౌడీయిజం ఎక్కడా ఉండకూడదని, రౌడీయిజం చేయాలని ప్రయత్నించేవారిని జిల్లా బహిష్కరణ చేస్తామని జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పులివెందుల , మైదుకూరు సబ్ - డివిజన్ల నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విస్తృతంగా డ్రోన్ కెమెరాలను వినియోగించాలని ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్ ఇండికేటర్స్ అయిన CEIR, ఈ-సాక్ష్య, సి.సి.టి.ఎన్.ఎస్, ఈ- సమ్మన్స్, ఈ- ప్రాసిక్యూషన్స్, సి.సి టి.వి 360 తదితర మాడ్యూల్స్ పై పట్టు పెంచుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను(బ్లాక్ స్పాట్స్) గుర్తించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి ఇతర శాఖల సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మలుపుల వద్ద అతి వేగం, వేగ నియంత్రణ లేకపోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతరం నిఘా ఉంచాలన్నారు. పదే పదే నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ తో పాటు జిల్లా బహిష్కరణ కు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లాడ్జి లలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరితగతిన ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల కు అప్పగించాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేసారు.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో పులివెందుల డి.ఎస్.పీ బి.మురళి , మైదుకూరు డి.ఎస్.పీ జి.రాజేంద్ర ప్రసాద్ , పులివెందుల , మైదుకూరు సబ్ డివిజన్లలోని సి.ఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

18 - 06 - 2026

# ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించండి..

### ఆణిముత్యాల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ప్రదానం: ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్,కాలవ శ్రీనివాసులు





**బొమ్మనహాల్ మన జనప్రగతి జూన్ 17:**–ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు,బొమ్మనహాల్ మండలం ఉద్దేహాళ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన "బొమ్మనహాల్ మండల విద్యా ఆణిముత్యాలకు ప్రతిభ పురస్కారాల ప్రధానం" కార్యక్రమంలో పాల్గొన్నారు,ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను తీసుకుని ప్రాధాన్యత క్రమంలో పాఠ్యాంశాలను విభజించుకొని పరీక్షలకు సిద్ధం కావాలని తెలియజేశారు, తల్లిదండ్రులు తమ విలువైన జీవితాన్ని పిల్లల కోసం త్యాగం చేస్తున్నారన్నారని,వారి విలువను తప్పక గుర్తించాలన్నారు.మీ చుట్టూ ఉన్న స్నేహితులను చూస్తేనే మీరు ఎలాంటి వారు,మీ ప్రవర్తన కూడా అంచనా వేయవచ్చన్నారు,మంచి ప్రవర్తన కలిగిన వారితో స్నేహం చేయడం వల్ల సమాజంలో మీ గౌరవం కూడా పెరుగుతుందన్నారు, మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు,చక్కగా పనిచేసే వారిని ప్రోత్సహించడం వల్ల వారు మరింత ఉత్సాహంతో పనిచేస్తారన్నారు,మెరుగైన ఫలితాలు సాధిస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు,పదవ తరగతి హిందీ సబ్జెక్టులో 100% ఉత్తీర్ణత సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు,తెలుగులో 16 మంది ఫెయిల్ కావడం పట్ల కాస్త అసంతృప్తి వ్యక్తం చేశారు, అమ్మాయిలు ఎక్కువ మంది పాస్ అవుతున్నారని,ఈసారి అబ్బాయిలు కూడా పోటీపడి చదివి వారితో సమానంగా ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గుర్తింపు తేవాలన్నారు.10వ తరగతి పరీక్షా సమయంలో విద్యార్థిని మేఘన తండ్రి అకాల మరణం చెందారన్నారు,ఆ అమ్మాయి పదైర్య పడకుండా పరీక్షలు రాసి 566 మార్కులు సాధించడం గొప్ప విషయం అని ప్రశంసించారు,ఆ అమ్మాయి చదువు మధ్యలో ఆగిపోకూడదన్న ఉద్దేశంతో కొందరు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు, ఆమెకు భవిష్యత్తులో ఏ అవసరం వచ్చిన తప్పక తన వంతు సహకారం ఉంటుందని ధైర్యం చెప్పారు,గతంలో బడి మానేసిన 1426 మంది బాలికలను తిరిగి బడికి చేర్పించి చదివించామన్నారు, ఎమ్మెల్యే తనయుడు,కాలవ ఫౌండేషన్ చైర్మన్ కాలవ భరత్ ప్రతిభావంతులైన విద్యార్థులను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు,అలాగే పేద విద్యార్థులకు చదువు విషయంలో ఏదైనా అవసరం ఉంటే తప్పక సహకరిస్తామన్నారు. పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ,విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునివేలు,డిప్యూటీ ఎంపిడివో వెంకటరమణ,మండల విద్యాశాఖాధికారులు వీరన్న,మల్లికార్జున,మండల సీనియర్ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, మండల కన్వీనర్ మల్లన్న, ఎంపీపీ ముల్లంగి నాగమణి, నారాయణస్వామి, మాజీ కన్వీనర్,బలరామి రెడ్డి, నాయకులు కొత్తపల్లి మహేంద్ర, కుమ్మరి మల్లికార్జున,సంగప్ప, నవీన్ మళ్లీడు సీనా,తుంగభద్ర ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కేశవ రెడ్డి,క్లస్టర్ ఇంఛార్జిలు గోవింద్, ఆనంద్,మరియు కేవీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ,వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మరియు అభిమాన నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్ వ్యవస్థ దేశానికే ఆదర్శం: ఇంచార్జి మంత్రి సవిత




**కడప,టౌన్ మన జనప్రగతి జూన్ 17:**– జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్. సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న స్మార్ట్ కిచెన్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పేర్కొంటూ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని ప్రత్యేకంగా అభినందించారు. జలధారజలహారతి కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీతి ఆయోగ్ మద్దతుతో స్టార్ట్ అప్ కడప, స్మార్ట్ కిచెన్ కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 5 స్మార్ట్ కిచెన్ల ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తుండగా, మరో 33 కిచెన్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 38 స్మార్ట్ కిచెన్ల ద్వారా 1 లక్షకు పైగా విద్యార్థులకు భోజనం అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.అదేవిధంగా, స్వర్ణాంధ్ర విజన్2047లో భాగంగా జిల్లా జీడీపీని రూ.13.26 కోట్ల మేర పెంచే లక్ష్యంతో కార్యాచరణ కొనసాగుతోందని తెలిపారు.

# రైతులు పంట నమోదు చేసుకోవాలి:ఏఓ స్వాతి


- ఏపీ ఎఐఎంఎస్ యాప్ ద్వారా పారదర్శకంగా ఎరువుల పంపిణీ
- రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు,ఎరువులు అందుబాటులోకి

**వీరబల్లి మన జనప్రగతి జూన్ 17:**–ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తమ పంట వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏవో) స్వాతి సూచించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ సమీప రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం,వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఏపీ ఎఐఎంఎస్ యాప్ ద్వారా అమలు చేస్తున్న నూతన ఎరువుల పంపిణీ విధానం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ విధానం ద్వారా ఎరువుల పంపిణీ మరింత పారదర్శకంగా, సులభతరంగా, వేగవంతంగా జరిగి రైతులకు సకాలంలో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.పంట నమోదు పూర్తి చేసుకున్న రైతులు అవసరమైన ఎరువులు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను సులభంగా పొందవచ్చని తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో సీజన్‌కు అవసరమైన వేరుశనగ, జీలగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అలాగే అన్ని రకాల ఎరువులు త్వరలోనే ఆయా కేంద్రాలకు చేరనున్నాయని స్వాతి వెల్లడించారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంట నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# డిఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా దేవిరెడ్డి శంకర్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు

- దివ్యాంగుల సేవయే దేవిరెడ్డికి విలువైన జన్మదిన కనుక
- వైయస్సార్సీపి నాయకులు విద్యానంద రెడ్డి

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 17:**– స్నేహశీలి,సాత్వికుడు సమర్థుడు, కార్యదక్షుడు, సేవాతత్పరుడు, అనతికాలంలోనే పులివెందుల ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్న ప్రజానాయకుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి ఆయురారోగ్యాలతో,ఆదేవుని చల్లని దీవెనలతో,అశేషమైన ప్రజల విశేష ఆశీస్సులతో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని,అన్నిరకాల విఘ్నాలు తొలగిపోయి ఆయన పులివెందుల ప్రజాక్షేత్రంలోకి, జనజీవనస్రవంతిలోకి అడుగుపెట్టే రోజు మరెంతో దూరంలో లేదని,అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరని,ప్రజాదరణ విస్తృతంగా ఉన్న నాయకులను ఎల్లకాలం జనాబాహుల్యానికి దూరంగా ఉంచలేరని ప్రముఖ వైఎస్ఆర్సిపి నాయకులు దొండ్లవాగు విద్యానందరెడ్డి పేర్కొన్నారు.సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి 60వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సుజాత థియేటర్ సమీపంలో గల ఆయన స్వగృహంలో డిఎస్ఆర్ యువసేన అధ్యక్షులు అర్కటవేముల డేనియల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముందస్తు జన్మదినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విద్యానంద రెడ్డి,శంకర్ రెడ్డి సతీమణి దేవిరెడ్డి తులశమ్మ తదితరులు ఆయన జన్మదిన కట్ చేసి దివ్యాంగులకు అందించారు.అనంతరం డిఎస్ఆర్ యువసేన నాయకులు డేనియల్ సమకూర్చిన చీరలను 50 మంది మహిళా దివ్యాంగులకు,వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. డిఎస్ఆర్ యువసేన యూత్, దివ్యాంగులు దేవిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో దేవిరెడ్డి సతీమణి తులశమ్మ, విద్యానందరెడ్డి,వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, డిఎస్ఆర్ యువసేన అధ్యక్షులు అర్కటవేముల డేనియల్,సభ్యులు హనిబాబు,పద్మకుమార్,చిన్న తదితరులు పాల్గొన్నారు.




# ఈశాన్య రాష్ట్రాల ప్రజల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 17:**–జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా ప్రాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లాలో విద్యాభ్యాసం మరియు ఉపాధి నిమిత్తం గణనీయ సంఖ్యలో నివసిస్తున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజల సంక్షేమం దృష్ట్యా, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, కర్నూలు కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక న్యాయ సహాయ సెల్ ను జిల్లా జడ్జి జి. కబర్ధి ప్రారంభించారు.జిల్లా జడ్జి మాట్లాడుతూ...ఈ ప్రత్యేక సెల్‌లో జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ప్యానెల్‌కు చెందిన న్యాయవాది బద్దల లక్ష్మీనారాయణ యాదవ్ మరియు పారా లీగల్ వాలంటీర్ ఓం ప్రకాష్ రెడ్డి సభ్యులుగా సేవలు అందించనున్నారని తెలిపారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ..ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు మరియు ఇతర అవసరమున్న వ్యక్తులు తమ న్యాయపరమైన సమస్యలు, ఫిర్యాదులు మరియు ఇతర వివాదాల పరిష్కారానికి ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు మరియు న్యాయ సేవా సంస్థల ద్వారా అందించబడే వివిధ సేవలను ఈ ప్రత్యేక సెల్ ద్వారా పొందవచ్చునని తెలిపారు.కాబట్టి, కర్నూలు జిల్లాలో నివసిస్తున్న ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, కర్నూలు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ సేవలను వినియోగించుకోవలసిందిగా కోరారు.ఈ సదస్సులో న్యాయవాది లక్ష్మీనారాయణ,శివరాం మరియు సులోచన,పి.యల్.వి ఓంప్రకాష్,న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి: జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత




**కడప మన జనప్రగతి జూన్ 17:**– రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి సాధనతో పాటు.. జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం తో, సమిష్టిగా పాటుపడాలని.. జిల్లా ఇన్చార్జి మంత్రి మరియురాష్ట్ర వెనుకబడిన తరగతులు,బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి,జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అన్నారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో.. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారసులుగా ఉన్న అధికారులు.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న రాష్ట్రముఖ్యమంత్రి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా తుడిచి పెట్టే లక్ష్యంతో.. అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. జిల్లా లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు.అందుకు అనుగుణంగా.. అధికారులు క్షేత్రస్థాయిలోబాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. పారదర్శకత, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా నడుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ప్రజలకు ఒక జవాబుదారీతనంతో సుపరిపాలన అందిస్తూ స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్య సాధన కు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకవైపు సంక్షేమ పథకాలను సంతృప్తి స్థాయిలో ప్రజలకు అందిస్తూనే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతోందన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా ప్రజల కోసం ప్రభుత్వం పని చేస్తోందని..జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.రెండేళ్ల సుపరిపాలనలో.. అభివృద్ధి,సంక్షేమం,ప్రజలకు పారదర్శక పాలన ను అందించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. భవిష్యత్తులో కూడా ముఖ్యమంత్రి ఆలోచనా విధానాన్ని అందుకుని స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారం దిశగా వైఎస్ఆర్ కడప జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేద్దామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా స్వీకరించి వారి వివరాలను నమోదు చేయాలన్నారు.స్వర్ణాంధ్ర2047 లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలో అమలు చేస్తున్న 10 సూత్రాల పురోగతిని, వైఎస్సార్ కడప జిల్లాలో ప్రాధాన్యతా రంగాల వారీగా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన పురోగతి, భవిష్యత్ లక్ష్యాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు క్షుణ్ణంగా వివరించారు. ప్రస్తుతం 5 స్మార్ట్ కిచెన్లు పనిచేస్తుండగా, మరో 33 కిచెన్లు ఏర్పాటు చేసి మొత్తం 38 కిచెన్ల ద్వారా జిల్లాలోని 1,778 పాఠశాలలు, కళాశాలలకు చెందిన 1,00,091 మంది విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించే ప్రణాళికను వివరించారు. ఇందుకోసం 95 వాహనాలు, 112 డెలివరీ మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో వివిధ రహదారుల విస్తరణ, బలోపేతం, వంతెనల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జాతీయ రహదారి67 (కడపరాయచోటిచెన్నై కారిడార్), ఎన్‌హెచ్40 (కర్నూలుకడపచిత్తూరు మార్గం), ఎన్‌హెచ్340 రహదారుల విస్తరణ, ఫోర్‌లేనింగ్, భూసేకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్,జమ్మలమడుగు శాసన సభ్యులు ఆదినారాయణ రెడ్డి,జేసి డా.నిధి మీనా, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు శాసనసభ్యులు నంద్యాల వరద రాజుల రెడ్డి, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన,డిఆర్ఓ మల్లికార్జునుడు, జిల్లా స్థాయి అధికారులు, ఆర్డీఓలు, పలు కార్పోరేషన్ ల డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల పంపిణీ విధానంపై అవగాహన కల్పించేందుకు పోస్టర్ల విడుదల



**కడప మన జనప్రగతి జూన్ 17:**– రైతులకు ఎరువుల పంపిణీ విధానం,APAIMS యాప్ వినియోగం,యూరియా, డీఏపీ పంపిణీ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన సమాచార పోస్టర్లను.. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ఇంచార్జి మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో కలిసి విడుదల చేశారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. రైతులు APAIMS యాప్ ద్వారా తమ పంటల వివరాలను నమోదు చేసుకోవడం, రైతు సేవా కేంద్రాలు (RSK\T) ద్వారా ఎరువులు పొందడం, ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంపొందించడం వంటి అంశాలపై పోస్టర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174